క్లుప్తంగా

ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ ముమ్మరం



జడ్చర్ల టౌన్: మండలంలోని పోలేపల్లిలో శుక్రవారం బీజేపీ కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ముమ్మరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను వారు రైతులకు వివరించారు. పథకాలను పొందేందుకు తప్పనిసరిగా ఫార్మర్ ఐడీ రిజిస్ట్రీ చేయించుకోవాలని సూచించారు. పంటలకు మద్దతు ధర పెంపు, పీఎం కిసాన్ సమ్మాన్‌నిధి, సబ్సిడీపై ఎరువుల పంపిణీ తదితర కార్యక్రమాలతో రైతులకు మేలు చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ శారద, కిసాన్‌మోర్చా జిల్లా అధికార ప్రతినిధి బుక్క నవీన్, శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకం.. పేదలకు వరం



గండీడ్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదలకు వరం లాంటిదని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్లారెడ్డి, మండల అధ్యక్షుడు జితేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం గండీడ్ మండలంలోని రెడ్డిపల్లి, రుసుంపల్లి, చిన్నవార్వాల్, పెద్ద వార్వాల్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గూడు లేని ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు నర్సింహారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ బాలస్వామి, ఆంజనేయులుగౌడ్, భీమయ్య, మొగులయ్య, తిరుపతయ్య, వెంకటేశ్, శ్రీనివాస్, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనుల పరిశీలన



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక టీచర్స్ కాలనీ నుంచి మర్లు వరకు నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను శుక్రవారం మున్సిపల్ మాజీ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ పరిశీలించారు. పనులు నాణ్యతగా చేపట్టి సకాలంలో పూర్తిచేయాలని గుత్తేదారుకు సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు విఠల్‌రెడ్డి, హన్మంతు, వినయ్, గోటూరి రాజు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



మద్దూరు: అక్రమంగా ఓ ఇంట్లో నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, పోలీసులు దాడులు నిర్వహించి పట్టుకున్న ఘటన మద్దూరు పట్టణంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం.. మద్దూరు పట్టణంలోని జే రాజు కిరాణంలో తనిఖీలు నిర్వహించగా 15 బస్తాల్లో దాదాపు 750 కిలోల రేషన్ బియ్యం పట్టుబడ్డాయని తెలిపారు. ఈ బియ్యంను పట్టణంలోని సంజీవరెడ్డి డీలర్ షాపులో అప్పగించామన్నారు. రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచిన రాజుపై పోలీసులు 6ఏ కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఓపెన్ టెన్త్ ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

దామరగిద్ద: తెలంగాణ ఓపెన్ స్కూల్, ఇంటర్మీడియట్ విద్యాభ్యాసం కోసం 2025–26 విద్యాసంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల స్టడీ సెంటర్ జీఎచ్‌ఎం అశోక్‌కుమార్, కోఆర్డినేటర్ శంభులింగ్ తెలిపారు ఆసక్తి గల విద్యార్థులు పూర్తి వివరాలకు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో, 94903 22492 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

అన్నదాత ఆగమాగం..!



ఉంద్యాలలో ట్యాంకర్ ద్వారా పత్తి మొలకలకు నీటిని అందిస్తున్న రైతు

- ముందుగా పత్తి విత్తనాలు విత్తిన వారి పరిస్థితి అగమ్యగోచరం
- వర్షాలు లేక ఎండుతున్న మొలకలు
- మరికొన్ని చోట్ల భూమిలోనే విత్తనం
- ముందస్తు వర్షాలు నట్టేట ముంచాయని రైతుల ఆందోళన

చిన్నచింతకుంట: రోహిణి కార్తెలో పంటలు సాగు చేస్తే మంచి దిగుబడులు వస్తాయని రైతుల నమ్మకం. అయితే ఈ సంవత్సరం ముందుగానే నైరుతి రుతుపవనాల రాకతో మే నెలాఖరులోనే తొలకరి పలకరించింది. వారం రోజులపాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురవడంతో అన్నదాతలు ఉత్సాహంగా దుక్కులు దున్ని.. రోహిణి కార్తెలోనే పత్తి విత్తనాలు విత్తారు. ఆ తర్వాత వరుణుడు మొహం చాటేయడంతో అన్నదాతలు ఆగమాగమవుతున్నారు. వ్యయప్రయసాలకోర్చి సాగుచేసిన పత్తిపంట వర్షాలు లేక ఎండిపోతుండటంతో ఆందోళనకు గురవుతున్నారు.

మొలకలను కాపాడుకునేందుకు పాట్లు..

చిన్నచింతకుంట మండలంలోని ఉంద్యాల, అమ్మాపూర్, గూడూర్, కురుమూర్తి తదితర గ్రామాల్లో దాదాపు 60 శాతం రైతులు ముందుగా కురిసిన వర్షాలకు పత్తి విత్తనాలు నాటుకున్నారు. అయితే వారం రోజులుగా వర్షాలు లేకపోవడంతో పత్తి మొలకలు వాడుపట్టి ఎండిపోతున్నాయి. కొన్ని విత్తనాలు మట్టిలోనే ఉండి మొలకెత్తని పరిస్థితులు నెలకొంది. ఈ నేపథ్యంలో రైతులు వర్షాల కోసం వెయ్యి కోళ్లతో ఎదురుచూస్తున్నారు. మరికొందరు రైతులు ఎలాగైనా మొలకెత్తిన పత్తి మొలకలను బతికించేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. బోరుబావులు లేని రైతులు ట్యాంకర్ల ద్వారా నీటిని తీసుకొచ్చి పంట పొలానికి తడి అందించాల్సిన దుస్థితి నెలకొంది.

7వేల ఎకరాల్లో సాగు..

మండలవ్యాప్తంగా ఈ ఏడాది 14,500 ఎకరాల్లో పత్తిపంట సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది. అయితే గతనెలలో కురిసిన వర్షాలకు దాదాపు 7వేల ఎకరాల్లో రైతులు పత్తి విత్తనాలు విత్తారు. ఎకరా సాగుకు రూ. 10వేలకు పైగా పెట్టుబడి పెట్టారు. తీరా పత్తి విత్తనాలు వేశాక వర్షాలు లేకుండా పోవడంతో రైతుల కష్టం నేలపాలైందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, ప్రస్తుతం మండలంలో 4.8 ఎం.ఎం. వర్షపాతం మాత్రమే నమోదైందని.. ఇది విత్తనాలు నాటుకునేందుకు అనువైన సమయం కాదని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. రైతులు తొందరపడి విత్తనాలు నాటారని చెబుతున్నారు. ఏదేమైనప్పటికీ ముందుగానే మురిపించిన తొలకరి వర్షాలు ఆగమాగం చేశాయని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

ఐదెకరాల్లో విత్తనాలు వేశా..



ముందుగా వర్షాలు కురుస్తున్నాయని ఐదెకరాల్లో పత్తి విత్తనాలు వేశా. పత్తి మొలకలు బాగానే వచ్చాయి. కాని గత వారం రోజులుగా వర్షం కురువక పోవడంతో మొక్కలు వాడుపట్టి ఎండిపోతున్నాయి. వర్షం కోసం వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నా. వరుణ దేవుడు రైతులపై కనికరం చూపాలి.

– రవి, రైతు, ఉంద్యాల

తొందరపడొద్దు..



రోహిణి కార్తెలో విత్తనాలు నాటుకుంటే మంచిదే. మంచి దిగుబడి వస్తుంది. కాని విత్తనాలు నాటుకునేంతగా అనువైన వాతావరణం ఏర్పడలేదు. విత్తనాలు నాటేందుకు దాదాపు 60 ఎం.ఎం. వర్షపాతం ఉండాలి. మండలంలో 4.8 ఎం.ఎం. వర్షం మాత్రమే కురిసింది. రైతులు తొందరపడి విత్తనాలు నాటుకున్నారు.

– రాజేష్ ఖన్నా, ఏఓ, చిన్నచింతకుంట

పంట మార్పిడితో అధిక దిగుబడులు



అవగాహన కల్పిస్తున్న ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ భరత్‌భూషణ్

భూత్పూర్: రైతులు పంటల మార్పిడిపై దృష్టి సారించాలి.. వేసిన పంట మళ్లీ వేయడం వల్ల దిగుబడి తగ్గడంతో పాటు భూ సారం తగ్గుతుందని మహబూబ్‌నగర్ ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ సీహెచ్ భరత్‌భూషణ్ అన్నారు. 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో భూత్పూర్ మండలం కర్వెన రైతు వేదికలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భరత్ భూషణ్ మాట్లాడుతూ.. పంటల సాగులో యూరియా, రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని సూచించారు. పంట మార్పిడి విధానంతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. మార్కెట్‌లో డిమాండ్ మేరకు పప్పుజాతి పంటలు పండించాలని సూచించారు. అదే విధంగా ఫర్టిలైజర్ దుకాణాల్లో విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా రశీదు తీసుకొని భద్రపర్చుకోవాలన్నారు. అనంతరం పాలెం వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.కళ్యాణి మాట్లాడుతూ.. రైతులు పచ్చిరొట్ట ఎరువుల వినియోగంపై దృష్టి సారించాలన్నారు. పొలం గట్లపై, ఖాళీ భూముల్లో మొక్కలు పెంచాలని సూచించారు. పంట కోతలు పూర్తయిన తర్వాత వ్యవసాయ వ్యర్థాలను కాల్చడం చేయరాదని.. భూమి ఆరోగ్యాన్ని పరిరక్షించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ మురళీధర్, ఏఈఓ ఆనంద స్వామి తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త వేర్వేరుగా అందించాలి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత

జడ్చర్ల టౌన్: పట్టణ ప్రజలు తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డి అన్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా శుక్రవారం మున్సిపాలిటీలోని 3వ వార్డులో నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొని తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. మున్సిపాలిటీలో రోజుకు 25 టన్నుల చెత్త వస్తుందన్నారు. తడి, పొడి చెత్తతో కంపోస్ట్ చేసి, డీఆర్‌సీ చేయడం ద్వారా ఆదాయం సమకూరుతుందన్నారు. అందుకోసం ప్రతి ఒక్కరూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలని కోరారు. రోడ్లు, డ్రెయినేజీలు, ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేసే వారికి రూ.500 నుంచి రూ. 5వేల వరకు జరిమానా విధిస్తామన్నారు. అదే విధంగా ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ నిషేధం పాటించాలని సూచించారు. ఉమెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బట్ట బ్యాగుల ప్రచారాన్ని వారు ప్రశంసించారు. అనంతరం 4వ వార్డులో మురుగు కాల్వల పనులను వారు పరిశీలించారు. కావేరమ్మపేట పురపాలిక కార్యాలయ ఆవరణలో మున్సిపల్ సిబ్బందికి నిర్వహించిన వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సతీష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, నాగేష్, ఈఈ అశోక్, వార్డు అధికారి కృష్ణయ్య, మెప్మా అధ్యక్షురాలు శ్వేత, ఆర్‌పీలు సరిత, స్వాతి పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంకు ఘనస్వాగతం



భూత్పూర్: పట్టణంలోని చౌరస్తాలో శుక్రవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కకు దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ఘనస్వాగతం పలికారు. మూసాపేటలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి భూత్పూర్ మీదుగా డిప్యూటీ సీఎం వెళ్తుండగా.. ఎమ్మెల్యేతో పాటు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నవీన్‌గౌడ్ శాలువా, గజమాలతో సత్కరించారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ఊరేగింపు



మక్తల్: పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో పునఃప్రారంభిచడంతో పాటు గణపతి, గరుత్మంతుడు, శ్రీకృష్ణుడు విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవాలను పురస్కరించుకొని విగ్రహాలను ఆంజనేయస్వామి ఆలయం నుంచి ట్రాక్టర్ ఊరేగింపు చేశారు. ఈ సందర్భంగా చిన్నారుల చేసిన దాండియా నృత్యాలు పలువురి ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీహరి, లలిత దంపతులు, డాక్టర్ రాము, కర్నిస్వామి, కోళ్ల వెంకటేష్, తిరుపతి, నర్సిములు, కిష్టప్ప, అంజనేయులు, శ్రీహరి, చంద్రశేఖర్, నీలప్ప, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య



మిడ్జిల్ మండలం బోయిన్‌పల్లిలో మాట్లాడుతున్న ఎంపీడీఓ గీతాంజలి

మహమ్మదాబాద్/రాజాపూర్/మిడ్జిల్: ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అందిస్తున్నట్లు ఎంఈఓ రాజునాయక్ అన్నారు. శుక్రవారం మహమ్మదాబాద్ మండల కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం అందించడంతో పాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన చేస్తున్నట్లు తెలిపారు. బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు.



మహమ్మదాబాద్ బాలుర పాఠశాలలో మాట్లాడుతున్న ఎంఈఓ రాజునాయక్

■ రాజాపూర్ మండలం తిర్మలాపూర్‌లో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఎంఈఓ సుధాకర్ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యం ఇచ్చి సర్కారు పాఠశాలలను బలోపేతం చేస్తోందన్నారు. బడిఈడు పిల్లలు ఎట్టి పరిస్థితుల్లోనూ బడి బయట ఉండకూడదన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను బాధ్యతగా చదివించి వారి ఉజ్వల భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రోజా రాణి పాల్గొన్నారు.

■ బడిబాట కార్యక్రమంలో భాగంగా మిడ్జిల్ మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధ్యాయులు ర్యాలీలు నిర్వహించారు. అనంతరం తల్లిదండ్రులతో సమావేశమై ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గీతాంజలి, ఎంపీఓ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కావేరమ్మపేట రోడ్డుకు మరమ్మతు



కావేరమ్మపేటకు వెళ్లే రోడ్డుపై వేసిన సీసీ ర్యాంప్

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీలోని కావేరమ్మపేట నుంచి 167వ నంబర్ జాతీయ రహదారి వైపు వచ్చే రోడ్డుకు మరమ్మతు చేపట్టి శుక్రవారం రాకపోకలను పునరుద్ధరించారు. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా కావేరమ్మపేట నుంచి వచ్చే రోడ్డు ఎత్తు కావడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. జాతీయ రహదారికి అడుగు మేర రోడ్డు ఎత్తుగా ఉండటం.. గుంతలు పడటంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. స్థానికులు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా రోడ్డుకు మరమ్మతు చేయించాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. ఈ మేరకు కావేరమ్మపేట రోడ్డుకు సీసీతో ర్యాంప్ వేయడంతో వాహనాల రాకపోలకు పునఃప్రారంభమయ్యాయి. రోడ్డు సమస్య పరిష్కరించిన ఎమ్మెల్యేకు వార్డు కౌన్సిలర్ కుమ్మరి రాజు కృతజ్ఞతలు తెలిపారు.

రూ. కోటికి పైగా కుచ్చుటోపి

- ఎస్పీకి ఫిర్యాదు

మహబూబ్‌నగర్ క్రైం/దేవరకద్ర రూరల్: అప్పు ఇస్తే వ్యాపారం చేసుకుంటా.. తిరిగి మీ డబ్బులను వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తా అని గ్రామస్తులను నమ్మబలికాడు.. ఒకరికి తెలియకుండా మరొకరి వద్ద దాదాపు 40 మందితో రూ. కోటికి పైగా అప్పుగా తీసుకున్నాడు.. తీరా తీసుకున్న అప్పు తిరిగి చెల్లించే సమయానికి తన వద్ద ఒక్క రూపాయి లేదు.. తనను, తన కుటుంబాన్ని ఎలాంటి ఒత్తిళ్లకు గురిచేసినా కేసులు నమోదు చేస్తానని ఐపీ పేరిట లాయర్‌తో నోటీసులు పంపించిన ఘటన దేవరకద్ర మండలం డోకూర్‌లో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గద్వాలకు చెందిన ముగ్గురు అన్నదమ్ముళ్లు 40 ఏళ్ల క్రితం డోకూర్‌కు వచ్చి పండ్ల తోటలను లీజుకు తీసుకొని వ్యాపారం చేస్తూ ఇక్కడే నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో సీజన్ సమయంలో గ్రామస్తుల నుంచి డబ్బులు అప్పుగా తీసుకొని సీజన్ ముగిసిన తర్వాత నమ్మకంగా చెల్లిస్తూ వచ్చారు. అయితే అన్నదమ్ముళ్లలో చివరి వ్యక్తి గ్రామంలో రూ. కోటికి పైగా అప్పు తీసుకున్నాడు. తీరా డబ్బులు చెల్లించే సమయానికి అప్పులు ఇచ్చిన వారికి ఐపీ నోటీసులు పంపించడంతో పాటు అడిగిన వారిపై దౌర్జన్యం చేయడంతో అప్పు ఇచ్చిన వారు లబోదిబోమంటున్నారు.

■ డోకూర్‌లో దినసరి కూలీలు, ఇతరుల నుంచి అప్పులు తీసుకుని మోసం చేసిన వ్యక్తిపై శుక్రవారం గ్రామస్తులు ఎస్పీ డి.జానకికి ఫిర్యాదు చేశారు. మామిడి తోటల వ్యాపారం చేసేందుకు కూలీలు, రైతులు ఇతరుల నుంచి రూ.కోటి 20లక్షల వరకు అప్పులు తీసుకున్నాడని.. తిరిగి చెల్లించాలని అడిగితే న్యాయవాది నుంచి నోటీసులు పంపించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. అప్పుగా తీసుకున్న డబ్బులు తిరిగి ఇప్పించాలని కోరారు.

'పత్రికా స్వేచ్ఛ హరించడం తగదు'

జడ్చర్ల టౌన్: జోగుళాంబ గద్వాల జిల్లాలో ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై ప్రజాభిప్రాయం మేరకు వరుస కథనాలు ప్రచురిస్తున్న ఓ పత్రిక సంపాదకుడు ఎంఎం రహ్మాన్‌పై అక్రమ కేసులు బనాయించడం తగదని పలువురు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ తిరుపతయ్యకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు వి.కృష్ణ, శ్రీధర్, సత్తార్, గోనెల నరేందర్ పాల్గొన్నారు.

ఈద్గాల ముస్తాబు

జడ్చర్ల టౌన్: బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని మున్సిపాలిటీలో ముస్లింల ప్రత్యేక ప్రార్థనలకు ఈద్గాలు ముస్తాబయ్యాయి. శనివారం బక్రీద్ పండుగ సందర్భంగా ఉదయం 7గంటలకు స్థానిక మైమన్ మసీదులో నమాజ్ అనంతరం బాదేపల్లి పాతబజార్ ఈద్గా వద్ద 9 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. అదే విధంగా జడ్చర్ల ఇండస్ట్రియల్ ఎస్టేట్, కావేరమ్మపేటల్లోనూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు ఈద్గాలు, మసీదుల్లో అన్ని ఏర్పాట్లు చేశారు.

మొర్రంమట్టి వాహనాల పట్టివేత

దేవరకద్ర: మండలంలోని చౌదర్‌పల్లి శివారులో శుక్రవారం ఎలాంటి అనుమతి లేకుండా మొర్రంమట్టిని అక్రమంగా తవ్వి తరలిస్తున్న టిప్పర్‌తో పాటు జేసీబీని పోలీసులు పట్టుకున్నారు. జేసీబీతో మొర్రంమట్టి తవ్వి, టిప్పర్‌లో మట్టిని మహబూబ్‌నగర్ మండలం రామచంద్రాపూర్‌కు తరలిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు చేసి పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన వాహనాలను తహసీల్దార్‌కు అప్పగించగా.. రెండింటికి కలిపి రూ. 20వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

ముగిసిన నెట్‌బాల్ శిక్షణ శిబిరం

ధన్వాడ: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న నెట్‌బాల్ వేసవి క్రీడా శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసిందని నిర్వాహకులు డాక్టర్ రామ్మోహన్ తెలిపారు. ఈ శిక్షణ శిబిరంలో బాలబాలికలు పాల్గొని, రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో పీఈటీ రవికుమార్, ఉపాధ్యక్షుడు వెంకటేష్ పాల్గొన్నారు.

ఇంటర్ అడ్మిషన్ల కోసం ఇంటింటి ప్రచారం



మాగనూర్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు శుక్రవారం విద్యార్థుల అడ్మిషన్ల గురించి మాగనూర్, కొత్తపల్లి, కున్సి, మూడుమాల్, గుడేబల్లూరు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. 'మీ భవిష్యత్‌కు భరోసా మాది' అంటూ అధ్యాపక బృందం పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు ఉన్నత విద్యపై అవగహన కల్పించారు. కళాశాలలో సీఈసీ, బైపీసీ తెలుగు మీడియం కోర్సులు అందుబాటులో ఉన్నాయని సీనియర్ అధ్యాపకుడు గుండెరావు తెలిపారు. విద్యార్థులకు ఉచిత విద్య, పుస్తకాలు, అడ్మిషన్ ఫీజు ఉండదన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామస్వామి, ప్రదీప్, సుదర్శన్‌రెడ్డి, రవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి



కోస్గి రూరల్: నారాయణపేట్ జిల్లా కేంద్రంలో ఈ నెల 15, 16 న జరిగే టీయూసీఐ జిల్లా ప్రథమ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా సహాయకార్యదర్శి ఎదిరింటి నర్సిములు అన్నారు. శుక్రవారం గుండుమాల్ మండల కేంద్రంలో ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులను కట్టు బానిసలుగా మార్చే నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికులను కనీస వేతనం రూ.26 వేలు అందించాలని, ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్లకు కారుచౌకగా విక్రయించొద్దని డిమాండ్ చేశారు. మహాసభలకు గ్రామ పంచాయతీ, మిషన్‌భగీరథ, ఆటో, రైస్‌మిల్ , అంగన్‌వాడీ, ఆశాకార్యకర్తలు, మధ్యాహ్నభోజన కార్మికులు, భవననిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జీపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాములు, వెంకటయ్య, మొగులయ్య, కృష్ణయ్య, తిరుమలయ్య, పార్వతీరెడ్డి, కొండప్ప తదితరులు ఉన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి చక్కని అవకాశం



పోతులమడుగు రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి



దేవరకద్ర మండలం చౌదర్‌పల్లిలో..



మహబూబ్‌నగర్ అర్బన్ మండలం ఏనుగొండలో..



మహమ్మదాబాద్ మండలం మొకర్లాబాద్‌లో..

దేవరకద్ర/భూత్పూర్/మహబూబ్‌నగర్ రూరల్/రాజాపూర్/మహమ్మదాబాద్: భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి రెవెన్యూ సదస్సులు చక్కని అవకాశమని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. శుక్రవారం భూత్పూర్ మండలం పోతులమడుగులో నిర్వహించిన రెవెన్యూ సదస్సును కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. భూ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు ఇబ్బందులు పడొద్దనే ఉద్దేశంతో ప్రభుత్వం గ్రామాల్లోనే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని.. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించి మెరుగైన విద్య అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ బడుల్లోనే పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. కాగా, పోతులమడుగులో 43, ఎల్కిచర్లలో 52 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ కిషన్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ గీత, ఆర్ఐ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

■ దేవరకద్ర మండలం చౌదర్‌పల్లి, పెద్దరాజమూర్ గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 42 దరఖాస్తులు అందినట్లు డీటీ స్వప్న తెలిపారు.

■ మహబూబ్‌నగర్ అర్బన్ మండలం ఏనుగొండ, రూరల్ మండలం మాచన్‌పల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి.. భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమాల్లో తహసీల్దార్లు ఘన్సీరామ్, శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్లు దేవేందర్ కేసిరెడ్డి, శ్యామ్‌సుందర్‌రెడ్డి, ఆర్ఐలు నర్సింగ్, చంద్రకాంత్, కాంగ్రెస్ నాయకుడు మల్లు వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

■ రాజాపూర్ మండలం ఈద్గాన్‌పల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 36 దరఖాస్తులు అందినట్లు తహసీల్దార్ రాధాకృష్ణ తెలిపారు.

■ మహమ్మదాబాద్ మండలం మొకర్లాబాద్‌లో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భూ సమస్యలపై తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి దరఖాస్తులను స్వీకరించారు.